క్లుప్తంగా

'కడియం'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీహరికి, కావ్యకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ మార్క శ్రీను, లునావత్ సుమన్‌నాయక్, చల్లా తిరుపతి, మారపాక వసంత్, నలిమెల ఏలియా, రాజు, దూమయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కావ్యను కలిసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



జఫర్‌గఢ్: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను హనుమకొండలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కావ్యతో పాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

నిర్మాణం ఆపాలి



జనగామ: పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న ఓ చర్చిలో ప్రభుత్వ అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణ పనులను ఆపాలని కాంగ్రెస్ నాయకుడు బక్క శ్రీనివాస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్ కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేని నిర్మాణాలపై ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రజా ప్రతినిధులు, అధికారుల పేరు చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై అదనపు కలెక్టర్ స్పందించాలన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

బచ్చన్నపేట: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నేడు (బుధవారం) భువనగిరిలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవడానికి విధివిధానాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇప్పించండి



కొడకండ్ల: వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇప్పించాలని మండల కేంద్రానికి చెందిన ఈజీఎస్ డైరెక్టర్, ఎంపీటీసీ అందె యాకయ్య మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కోరారు. 25 ఏళ్లకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నందున ఎస్సీ రిజర్వ్‌గా ఉన్న వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



బచ్చన్నపేట: బీజేపీ మండల నూతన కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా మిన్నాలపురం జలేందర్, కందుకూరి నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా బంగారు మహేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నీల కనుకయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా జంధ్యాల సురేష్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు సర్వాయి పాపన్న



రఘునాథపల్లి: పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వేణుకుమార్ తదితరులు



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న గౌడ కులస్తులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



కొడకండ్లలో..



జనగామ రూరల్: పెంబర్తిలో..

రఘునాథపల్లి: వీరోచిత పోరాటంతో ఢిల్లీ సుల్తానుల ఆగడాలను ఎదిరించి బహుజనుల రాజ్యాన్ని స్థాపించిన విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖిలాషాపూర్‌లో పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణుకుమార్ మాట్లాడుతూ పాపన్న భావజాలాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దైతల రంజిత్‌కుమార్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకన్న, కార్యదర్శి ఉపేందర్, మండల ఉపాధ్యక్షుడు రంగు రాజశేఖర్‌గౌడ్, రాజకుమార్, ఉపేందర్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని కూనూర్ గ్రామంలో సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడ్డం రాజు, మూల మహేష్‌గౌడ్, గడ్డం యుగేందర్, కోట రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి ఐలోని సుధాకర్‌గౌడ్ అన్నారు. తాటికొండలో గౌడ సంఘం అధ్యక్షుడు బొంగోని యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజు, పండుగ బద్రి, రత్నాకర్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

కొడకండ్ల: సర్వాయి పాపన్న వర్ధంతిని గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనగామ రూరల్: సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పెంబర్తిలో అంబాల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటనారాయణ ఉన్నారు.

దేవరుప్పుల: కోలుకొండలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని స్మారక విగ్రహానికి గౌడ కులసంఘం, యువజన నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

బెల్ట్‌షాపులను నివారించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో బెల్ట్‌షాపులను పూర్తిగా నివారించేలా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. నియోజకవర్గంలోని ఎక్సైజ్ అధికారులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, మద్యం నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, లిక్కర్ సరఫరాపై నియంత్రణ ఉండాలని, బెల్ట్‌షాపులలో మద్యం అమ్మకాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని ఆయన సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, ఎక్సైజ్ సీఐ భాస్కరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోటీలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: ఏబీవీపీ రాష్ట్రీయ కళామంచ్ సింగిడి–2024 పేరుతో ఈనెల 20, 21 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్న విద్యార్థి సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పోటీల వాల్‌పోస్టర్లను నాయకులు, విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, కళలను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.వంశీ, చిలువేరు హర్షవర్ధన్, భానుప్రసాద్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఈ రాజ్‌గోపాల్

చిల్పూరు: చిల్పూరు వాగుపై రూ. 60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న హైలెవల్ కల్వర్టు పనులను పీఆర్ డీఈ రాజ్‌గోపాల్, ఏఈ నరేష్, నాగరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్‌గోపాల్ మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం పూర్తి కావాల్సి ఉండగా అనివార్యకారణాలతో ఆగిపోయిందని, వర్షా కాలంలోపు నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పాలకుర్తి టౌన్: కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి టౌన్/దేవరుప్పుల: పాలకుర్తి, దేవరుప్పుల మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని గాంధీభవన్ వేదికగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్, కొమ్మూరి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో పాలకుర్తి మండలం నుంచి పాలకుర్తి మాజీ సర్పంచ్ కమ్మగాని ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ మారం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ అంగడి సోమనర్సయ్య, మాజీ వార్డు సభ్యులు తదితరులు, దేవరుప్పుల మండలం నుంచి చామల విక్రమ్‌రెడ్డి (చిన్నమడూరు), కడవెండికి చెందిన మాజీ సర్పంచ్ పోతిరెడ్డి బెట్లీనా, లీనారెడ్డి దంపతులు, కామారెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యుడు జాకీర్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, తొర్రూరు డీసీసీబీ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ ఎంపీపీ గడ్డం యాకసోమయ్య, రాష్ట్ర సేవాదళ్ ఆర్గనైజర్ గుగ్గిళ్ల ఆదినారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జలగం కుమార్, భూమ రంగయ్య, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు నాగయ్య, మొగుళ్ల కుమార్, దేవరుప్పుల మండల అధ్యక్షుడు శ్రీరాములు, గణేష్, నాగరాజు, రెడ్డిరాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న కొలిపాక సతీష్

స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మతిభ్రమించినట్లుగా మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యపై వారి వ్యాఖ్యలు సరికాదని పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లోకి చేర్చుకోలేదా అన్నారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లోకి వెళ్తే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని నిరసన కార్యక్రమాలు చేస్తే పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు ప్రస్తుతం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కడియం శ్రీహరిపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు చేసిన హామీలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. నాయకులు చల్లా తిరుపతి, జె.శ్రీనివాస్, వెంకటస్వామి, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారం అందుకున్న వెంకన్న



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి వెంకన్న నంది ప్రతిభా పురస్కారం అందుకున్నాడు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం రాత్రి శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రాచీన కళలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న చిందు యక్షగాన కళాకారులను ఆదుకోవడమే కాకుండా, వారిని ప్రోత్సహించేందుకు పురస్కారాలను అందజేయడం జరిగిందని ప్రముఖ సినీ దర్శకుడు జీకే భారవి, సినీ రచయిత మల్లికకంటి భవానీ తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నకు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పి. నరేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

లింగాలఘణపురం: మాణిక్యాపురం, కళ్లెం గ్రామాల్లో మంగళవారం త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. జనగామ, తొర్రూరు, భువనగిరి, తొర్రూరు కమిటీ సభ్యులు దేవేందర్, రామరాజు, సాయిరాజ్, అశోక్, కోటి, ఉపేందర్, లింగస్వామి పాల్గొన్నారు.

ఎండిన వరి పంటను సర్వే చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గం పరిధి దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో సాగునీరు అందక ఎండిన వరి పంటలను అధికార యంత్రాంగం సత్వరమే సర్వే చేసి ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,సీనియర్ నాయకుడు బస్వ మల్లేశం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడియం వెంటే మేమంతా..

జఫర్‌గఢ్: కడియం శ్రీహరి వెంటే మేమంతా ఉంటామని మండలంలోని జఫర్‌గఢ్, తమ్మడపల్లి (జి) గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ తాము కడియం శ్రీహరి వెంటే నడుస్తామని ముక్తకంఠంతో చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, కుల్లా మోహన్‌రావు, అన్నెపు అశోక్, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, మాజీ సర్పంచ్ మొగిళిపాక నర్సింగం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తాటికాయల వరుణ్, ఎండీ ముజిబ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలకు ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాతా బృందం బాధ్యులు సాంబయ్య, ఎడవెల్లి విజయ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాటల ద్వారా ప్రజలను ఓటుహక్కుపై చైతన్యం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వయోజనులు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కళాకారులు గడిపె బాలయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

బచ్చన్నపేట/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తి: సీపీఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కలెక్టర్ రిజ్వాన్‌బాషాపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా నాయకులు సింగారపు రమేష్, సుంచు విజేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కార్యదర్శి మునిగెల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు వేర్వేరుగా పాలకుర్తి, బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించిన అంశాల విషయమై సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డితో పాటు పార్టీ నాయకులు కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్తే అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాత పూర్వకంగా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. నాయకులు బెల్లంకొండ వెంకటేష్, రామగళ్ల అశోక్, కొడెపాక యాకయ్య, వంగపండ్ల సోమయ్య, సోమ సత్యం, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల జనసందోహం నడుమ అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మాలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, వసంత, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు భక్తులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



చిల్పూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విక్రం



రఘునాథపల్లి: శివాజీనగర్‌లో.. శ్రీనివాసులు



తరిగొప్పుల: అక్కరాజుపల్లిలో.. దేవేందర్‌రెడ్డి

చిల్పూరు: రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలుకేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రత్యేకాధికారి బుద్ధె విక్రంకుమార్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేట, మల్కాపూర్, కొండాపూర్, నష్కల్ గ్రామాల్లో మంగళవారం ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఏలు రమాదేవి, శోభ, గంగ, యమున, కృష్ణవేణి, కనుకతార, శమాదేవి, రేణుక, కరుణ, మండల పశువైద్యాధికారి అనేష్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

రఘునాథపల్లి: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని శివాజీనగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో బస్తా కాంటా 41 కేజీలు మాత్రమే వేయాలని, ఎలాంటి అవకతవకలకు తావివ్వొద్దని సూచించారు. సీరియల్ ప్రకారం టోకెన్ అందజేసి వారం రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా నిర్వాహకులు పని చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, ఏఎన్ఎం, ఆశలు ఓఆర్‌ఎం ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం కందారి సారయ్య, సీసీలు సూత్రపు సంపత్, మొగుళ్ల రీనావతి, వీవోఏ రాజేశ్వరి, కావ్య, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, అక్కరాజుపల్లి, పోతారం, భోజ్యాతండా, జాలుబాయితండాల్లో వెన్నల, శ్రీప్రతాపరుద్ర, వెలుగు ప్రగతి, దుర్గాభవాని, తిరుమల బంజారా, ఏడుపోచమ్మలతల్లి గ్రామసమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం విజయ మంగళవారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమంలో ఏఈఓ జయశ్రీ, సీసీలు యాదగిరి, రాములు, గ్రామస్తులు కిష్టయ్య, అంకం రాజు, గోరంతల వీరన్న, యాదగిరి, నర్సింహాలు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై బీఆర్‌ఎస్, బీజేపీ మొసలి కన్నీరు'

రఘునాథపల్లి: రైతులపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని, వారు రైతులకు చేసింది ఏమి లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ రైతులకు బేడీలు వేసిన విషయాన్ని మర్చి పోయారా అని ప్రశ్నించారు. రైతులకు పంట నష్ట పరిహారం, రుణమాఫీ చేయక మోసం చేయడంతో వారి ఉసురు తాకిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నల్ల చట్టాలు తీసుకవచ్చి రైతులను తొక్కి చంపిన ఘనత అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా, రుణమాఫీ చేసి తీరుతుందని, ఇందులో ఎలాంటి సందేహాలు లేవన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు రైతులు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

డిక్షనరీల బహూకరణ



జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య–లక్ష్మి దంపతుల కుమారుడు కొడారి లోకేశ్ జ్ఞాపకార్థం డిక్షనరీలను మంగళవారం బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, మనోహరస్వామి, దిలీప్ పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు షురూ..



చిల్పూరు : మండలంలోని నష్కల్ రామలింగేశ్వరస్వామి(శివాలయం)లో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. వారసత్వ అర్చకత్వంలో భాగంగా ఆలయాన్ని మూసివేయకుండా ఘణపురం పరమేశ్వరశర్మ పూజలు చేస్తున్నాడు. ఇటీవల ఆలయాన్ని మూసివేయడంతో ధూపదీప నైవేద్యం లేకుండా పోయిందని నల్లగొండ జిల్లా దేవాదాయ శాఖ అధికారులకు పరమేశ్వరశర్మ వినతి పత్రం అందజేయగా పూజలు చేసే అవకాశం దక్కింది.